# ఏది న్యాయం?

ఆనందరావు యింట్లో అడుగుపెట్టగానే సరోజ ఎదురు రాకపోయేసరికి ఒక్కకేక పెట్టాడు "సరోజా" అంటూ. పెరటివైపు గుమ్మంలోంచి లోపలికి తొంగిచూసింది సరోజ. ఇంకా ఎండ పూర్తిగా తగ్గలేదు. మంచి పనిలోవుంది సరోజ. చీర కుచ్చెళ్ళు కొంచెం పైకి పెట్టింది. పాదాలమీద గులాబీ రంగు పరికిణీ కుచ్చులు వేలాడుతున్నాయి. నుదుటిమీద చిరుచెమట నిగనిగ లాడుతోంది. రెండు బారు వెంట్రుకలు జడలోంచి వూడి ముఖం మీదుగా వేళ్ళాడుతున్నాయి. గుమ్మంలోకి వచ్చి, "వచ్చేశారా! ఇంకా టైము కాలేదను కున్నా. ఎందుకూ క్షణంలో కాఫీ యిస్తా, ముఖం కడుక్కోండి" అంటూ మట్టిచేతులు కడుక్కోటానికి నూతి పళ్ళెంలోకి పరుగెత్తింది. ఆనందరావు విశ్రాంతిగా కుర్చీలో జారగిలపడ్డాడో లేదో సరోజ కాఫీగ్లాసుతో వచ్చేసింది.

"చాలా పెందరాళే వచ్చేసినట్టున్నారు" అంది నవ్వుతూ.

"ఏమీ కాదు. రాణీగారు చాల హడావిడిలో వున్నట్లు న్నారు అందుకే టైమ్ కూడా తెలిసివుండదు" కొంటెగా ఎత్తి పొడిచాడు.

"అది కాదండి. మన గదికి యిటువైపు జాజి మొక్క లేదూ, అది పూర్తిగా ఎండిపోయి, చచ్చిపోవడానికి సిద్ధంగా వుంది. అందుకు దానికి చక్కగా బోదెచేసి నీళ్ళు పొయ్యటానికి వీలుగా తయారుచేశాను....నిజమే, పనిలోపడి నేను టైమెంతయిందో చూడలేదు సుమా!."

"అప్పుడే మొదలుపెట్టావూ, మనం వచ్చి మూడు రోజులైందో లేదో యింకా" అంటూ నవ్వులాటగా తేలిగ్గా తీసిపారేశాడు.

"అదేవిటి ? బాగుంది మనం వున్నంతకాలం మన యిల్లే, అన్నీ చేసుకుని యింటిని కలకల్లాడుతుండగా చూస్తే ఎంత ఆనందంగా వుంటుందో."

"అవును, నీకు పనా, పాటా"

"పోనీలెండి. ఏదో ఒక మంచి వ్యాపకమే కదా" ఖాళీ గ్లాసు తీసుకుని లోపలికెళ్ళింది సరోజ.

*          *          *

వేసవికాలం సాయంత్రం చల్లనిగాలి వీస్తోంది. జాజి మొక్క దగ్గరగా కుర్చీవేసుకుని ఎడంచేత్తో పుస్తకం పట్టుకుని చదువుతూ, కుడిచేత్తో జాజిమొక్కని సున్నితంగా నిమురు తున్నాడు ఆనందరావు. వేడి వేడి పకోడీలు ప్లేట్లోపెట్టి తెచ్చి అతని ముందుంచి వయ్యారంగా ముందుకు తోసింది.

ఆనందరావు జాజిమొక్క ఆకులు సున్నితంగా తాకితే,

"ఏమిటలా నలిపేస్తారూ ఆకుల్ని" అంది అభిమానంగా మొక్కవైపు చూస్తూ.

"ఓయబ్బో ? అంత ప్రేమైతే కష్టం, అయినా నీకిష్టమైంది నాకు మాత్రం కాదా" అన్నాడు.

"అవును గానీ చూశారా, మొక్క ఎంత బాగా ఎదిగిందో, పచ్చని ఆ ఆకుల్ని చూస్తుంటే ఎంత ఆనందంగా వుంటోంది. ఆ రెమ్మలలోంచి గాలి వచ్చి వంటిని తాకితే ఎంత హాయో కదా" అంది ఆనందంగా.

"చాలా బాగుంది నీ పరవశత్వం. మరీ రచయిత్రిలా మాట్లాడుతున్నావు" వేళాకోళం చేశాడతను. సరోజ లేచి పైకి పాకిపోయిన జాజి తీగెను కలయ జూసింది. ఇంకా మొగ్గ వెయ్యలేదు. కాని చిటారికొమ్మలు మేడమీద ఇంటిగల వాళ్ళ గదిదగ్గర అల్లల్లాడుతున్నాయి. ఆశగా మొగ్గకోసం ఆత్రుతపడింది సరోజ మనసు.

"సరోజా ! రోజూ నువ్వు కష్టపడి బిందెడేసి నీళ్లు పోస్తున్నావు, అందుకే దీని మీద నీకంత అనురాగం" అన్నాడు.

యిద్దరూ హాయిగా నవ్వుకున్నారు. వేడి పకోడీలు అయిపోయాయి. చల్లనిగాలి మాత్రం వీస్తూనే వుంది.

* * *

ఆ రోజు సరోజ పట్టరాని ఉత్సాహంతో కలకల్లాడి పోతూండటం చూసి ఆనందరావే అడిగాడు ఏమిటి సంగతని.

“చెప్పాక మీరు నవ్వకూడదు మరి. మన జాజి మొక్క నాలుగు మొగ్గలు వేసిందండీ” అంది అమాయకంగా సరోజ. నవ్వొస్తు అన్నా నవ్వేశాడు ఆనందరావు.

“పిచ్చిపిల్లా నీ కెంత ముచ్చట అదంటే” అంటూ తనూ మురిసిపోయాడు కల్లాకపటం ఎరుగని భార్యని చూసి.

సాయంత్రమైంది. సరోజ జడ అల్లుకుంటోంది. పైకి వెళ్ళి ఆ నాలుగు మొగ్గలు కోసుకురావాలి. తెచ్చి ఈ రోజు అవి దేవుడి ముందు పెట్టాలి. అవి తెల్లగా దేవునిపాదాల దగ్గర విచ్చుకున్న తర్వాత రాత్రి కళ్ళకద్దుకుని తను జడలో పెట్టుకోవాలి. ఆలోచిస్తూ సరోజ జడ కొసలు మెలిపెడుతుంది. జాజి మొక్క మొదట్లో అటూ యిటూ తిరుగుతోంది. ఇంతలో పైన తలుపుతీసిన చప్పుడైతే పైకి చూసింది. ఇంటి గలామె జాజి మొక్కను ముందుకు వంచుకుని ఆ నాలుగు మొగ్గలు తుంపి, లోపలికి తీసుకెళ్ళిపోయింది. సరోజ విల విల్లాడిపోయింది. వెంటనే ఏం చెయ్యాలో ఆమెకి తోచలేదు. చర్రున కోపం ఆమె చెంపల్లోకి పాకింది. ముఖం కందగడ్డలా అయిపోయింది. ఆమె ఒక్క క్షణం కూడా ఆలోచించలేక పోయింది. చకచకా మెట్లెక్కి తలుపు తట్టింది. తలుపు తెరుచుకుంది. ఎదురుగా ఇంటి గలామె వరలక్ష్మి ఠీవిగా నిలబడి——

"ఏవిఁటమ్మా" అంది.

"అది కాదండి - మరి" అంటూ తనేం చెప్పాలో అదెలా మొదలుపెట్టాలో అర్థంకాక నిలబడింది.

ఇంతలో వరలక్ష్మి నవ్వుతూ "లోపలికి రామ్మా" అంది.

కాని సరోజకి లోపలికి వెళ్ళాలనిపించలేదు.

"మీరు జాజి మొగ్గలు కోశారు. అవి మొదటిసారి పూసినవి. అవి నాకు కావాలి" అంది ఆ అనడం ఎంత అసందర్భంగా వుందో, ఆమెకి మనసులో తెలుస్తూనే వుంది. మాటకీ మాటకే పొసగకుండా తను మాట్లాడిన తీరు తనకే ఎబ్బెట్టుగా అనిపించింది.

వరలక్ష్మి ముఖం గంభీరంగా అయింది.

"అదేవిటమ్మా - మొదటిగా పూసిన పూలు మాకు మాత్రం కావాలని వుండదూ" అంటూ సాగదీసింది.

"అసలు ఎండిపోయిన ఆ మొక్కకి నీళ్ళుపోసి, ప్రాణం నిలబెట్టింది నేను ఈ రెండు నెలలుగా దానికెంతో సంరక్షణ చేసి ప్రాణప్రదంగా చూసుకొంటున్నాను" అంది సరోజ ఉక్రోషంగా.

"బాగానే వుందమ్మా! అయితే మా యింట్లో మా మొక్కలమీద మాకే హక్కు లేదంటావా ఏమిఁటి" అంది. ఎంతో మర్యాదగా వున్న ఆ మాటల్లో అధికారం వుంది.

"అది కాదండీ...." ఇంకా ఏదో అనబోయిన సరోజకి ఆమె అడ్డువస్తూ.

"పోనీ కావాలంటే కాసిని పూలు నువ్వూ పెట్టు కుందువు గానిలే, బాగా పూశాక" అంది సముదా యిస్తున్నట్లు.

సరోజకి యింక ఒక్కక్షణం అక్కడ నిలబడ్డ బుద్ధి వెయ్యలేదు. చకచకా మూడేసి మెట్లు దిగుతూ కిందికి వచ్చే సింది. ఆమెలో కోపం ఉక్రోషం పెల్లుబికాయి. అశక్తత వెక్కిరించినట్లనిపించింది. కళ్ళల్లో నీళ్ళు చివ్వున చింది చెంపల మీదికి జారాయి. కాని ఆమె వెంటనే కన్నీటిని ఆపుకుంది. ఆమె దుఃఖం మళ్ళీ కోపంగా మారింది.

విసురుగా ముందు గది తలుపులు వేసి పడకకుర్చీలో కూలబడింది. మనసు బరువుగా బాధగా అనిపించసాగింది. నిశ్శబ్దంగా ఆలోచిస్తూ కూర్చుంది. నిజమే! చెట్టు వాళ్ళది. ఇల్లు వాళ్ళది. కాని తను కొనవూపిరితో వున్న మొక్కకి ఎంతో ప్రేమతో అభిమానంతో సేవ చేసింది. నిజంగా అలా తను ఆ మొక్క తన సొంతం అనే అనుకుంది. పువ్వులు తన కేమీ కొత్తకాదు. ఏదో రకం పువ్వులు తను రోజూ పెట్టు కుంటూనే వుంటుంది. కాని తన కెందుకంత బాధ? నిజంగా తను పెంచిన అభిమానంతో ఆ పువ్వులు ఆశించింది. ఈ మమకారం తప్పా? ఈ అనుబంధం తప్పా? తప్పేనేమో తనది కాదని తెలిసిన దానిమీద అధికారం తప్పేమరి.

తలుపు చప్పుడైంది. ఆనందరావు “పలికొస్తూనే లైటువేసి రోజా! ఏవిటి చీకట్లో కూర్చున్నావు” అన్నాడు సరోజ మౌనంగా కుర్చీలోంచి లేచింది.

“అరె ఏమిటలా జిడ్డు ముఖంతో వున్నావు” అంటూ ఆశ్చర్యపోయాడు.

“అబ్బె ఏమీలేదు” అంటూ దొడ్లోకి వెళ్ళింది ముఖం కడుక్కోటానికి.

“ఎక్కైనాపోదామా — చిరాకుగా వుంది” అంది పౌడరు ముఖానికి అద్దుకుంటూ. ఆనందరావు టైమ్ చూచుకుని సినిమాకి టైమ్ వుండదు. అలా తిరిగి వద్దాం అవునుగాని ఎందుకలా ఉన్నావు” అన్నాడు సరోజను పరీక్షగా చూస్తూ.

“చెప్తాను. అలా బయటకెళతాం కదా” అంది సరోజ.

చల్లగాలికి బయటకి రాగానే సరోజ మనసుకి హాయిగా అనిపించింది. ఆమె మెల్లగా ఏమాత్రం ఆవేశం లేకుండా ఆనందరావుతో అంతా చెప్పింది. అతను నవ్వుతాడేమో అనుకుంది. కాని అతను నవ్వలేదు ఒక్క నిముషం మౌనంగా వుండి “ప్రతి చిన్న విషయానికి బాధపడి లాభం లేదు. వాళ్ళు అలాగే వుంటారు అయినా ఆ పువ్వులు కోసుకోకపోతే నీకు పోయిందేమిటి ?” అన్నాడు తేలిగ్గా.

“నిజమే అనుకోండి - అసలు విషయం అదికాదు” - అంటూ యింకా ఏదో చెప్పబోయి ఆగిపోయింది. ఆమె ఆలోచనలో పడిపోయింది. దాన్ని గురించి ఏమీ మాట్లాడాలని అనిపించలేదు.

o o o

రోజులు గడుస్తున్నాయి. జాజిమొక్కకి పువ్వులు విపరీతంగా పూస్తున్నాయి. చిత్రంగా అన్నీ చిటారు రెమ్మల మీద గుత్తులే. అందని ఆకాశంలో అందాల తారల్లా, ఉండ బట్టలేక సరోజ నీళ్ళు పోద్దామనుకుంటే ఆనందరావు "నీకెందుకా చాకిరీ మాట్లాడక యింట్లో కూర్చో" అంటూ కసిరాడు, సరోజ వూరుకుంది. ఇంటిగల వరలక్ష్మి ఒక్కరోజు కూడా యిన్ని పువ్వులు తీసుకోమన లేదు. మళ్ళీ సరోజ అడగనూ లేదు. ఒక నెల రోజులు మొక్కకి ఎవరూ నీళ్ళు పొయ్యలేదు.

ఆ రోజు మొక్క మొదట్లో బీటలువారి వుంది. మొగ్గలు కూడ పెద్దగా లేవు. సరోజ మనస్సు కలుక్కుమంది. పాలిమ్మని చంటివాడు కాళ్ళబడి వేళ్ళాడితే ఛళ్ళున వీపు మీద కొట్టి వెంటనే బాధపడిపోయిన తల్లిలా అయిపోయింది సరోజ. జాజిమొక్క మీద ఎనలేని ప్రేమ పొంగుకొచ్చింది. మొగ్గలమీద ఆమె మనసు నిలవనేలేదు. ఎండి పైకి కనబడు తున్న వేళ్ళు చూస్తే ఆమె మనసు బాధతో గుబగుబలాడింది. అది తనకేమీ యివ్వలేని నిస్సహాయ సితిలో వున్నటు అని పించింది. సరోజ ఒక్క వుదుటున లేచి వంటింట్లో బిందె తీసు కుని వరుసగా మూడు బిందెలనీళ్ళు మొక్కకి పోసింది. అది పీల్చుకుని పోతుంటే తృప్తిగా నిల్చుని చూస్తూ వుండి పోయింది.

o o o

ఆనందరావు యింట్లో అడుగు పెడుతూనే మీ నాన్న గారు ఉత్తరం వ్రాశారు అంటూ కవరు చేతికిచ్చి బూట్లు విప్పుకోవడం మొదలు పెట్టాడు సరోజ ఆతృతగా కవరులో కాగితం తీసింది.

చి॥ ఆనందరావుకి,

మేమంతా క్షేమం. మీ రిద్దరూ ఎలా వున్నారు ? బొత్తిగా నువ్వు ఉత్తరాలు వ్రాయడం మానేశావు. పోనీ సరోజ యింట్లోనే వుంటుంది. అదైనా వ్రాయవచ్చు ఏమిటో మీకు అశ్రద్ధ.

అసలు విషయం మీకు బియ్యం ఆడించి పంపు తున్నాను. ఈ ఏడు పొలం బాగానే పండింది. కాని ఏం లాభం ?

ధాన్యం యింటికొచ్చేసరికి తల ప్రాణం తోకకి వస్తుంది. పండింది పండినట్లు చెప్పరు. వాళ్ళు యిచ్చింది తీసుకోవాలి. ఏమైనా అంటే కష్టపడి చెమటోడ్చి సాగు చేశాం. అసలు కష్టం మాదే బాబూ. అంటారు. నిజానికి పొలం మనది. అయినప్పటికీ ఈ రైతులతో వచ్చిన చిక్కే అది. కష్టపడ్డ వాళ్ళకే నట ఫలితం. ఇంక భూమి గలవాడు ఏమై పోవాలనో వాళ్ళ ఉద్దేశం. ఏం న్యాయమో అర్థం కాదు....సరేలే....

మన వెంకన్న కిచ్చి బియ్యం పంపుతున్నాను. అమ్మాయిని జవాబు వ్రాయమని చెప్పు.

వుంటాను

ప్రేమతో

మామయ్య

సరోజ ఉత్తరం పూర్తిచేసి అలా కుర్చీలో కూర్చుండి పోయింది. రాత్రనక, పగలనక కష్టపడి గింజలు పండిస్తే ఆ గింజల మీద హక్కు ఎవరికుంటుంది ? భూమి గల ఆసామి అనుభవించటానికి వుంచుకున్న ధాన్యం మినహాయించే కదా కష్టపడ్డ వారికి రావాలని అంటారు. ఐతే యింటి గలామె కే జాజిపూలు మీద హక్కా ?

ఇది న్యాయమా ?

సరోజ బుర్ర వేడెక్కి చిరాగ్గా కుర్చీలోంచి కదిలింది.

( "స్నేహ" మాసపత్రిక నుండి )